మా కలం.. మీ గళం..

# మన గళం

దిన పత్రిక

RNI : APTEL/ 2017/74310

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర | సంపుటి : 08 | సంచిక : 193 | మంగళవారం | 13 - 01 - 2026 | పేజీలు: 8 | వెల: 4

## ప్రతి ఫిర్యాదుకు సత్వరమే పరిష్కారం



3లో..




## విధ్వంసం నుంచి సుపరిపాలన దిశగా రాష్ట్రాన్ని

# నడిపిస్తున్నాం

- ☐ 2025 మంచి ఫలితాల ఏడాది.. 2026లో మరింత వేగం
- ☐ పుష్కరాల్లోగా పోలవరం పూర్తి.. జలసంపదతో రాష్ట్ర అభివృద్ధి
- ☐ పెట్టుబడులకు ఏపీ దేశంలోనే అగ్రగామి

మన గళం, అమరావతి :

విధ్వంసమైన వ్యవస్థల నుంచి రాష్ట్రాన్ని తిరిగి సుపరిపాలన దిశగా గాడిలో పెట్టామని, 2025 ఏడాది ప్రభుత్వానికి మంచి ఫలితాలను అందించిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సచివాలయంలో మంత్రులు, కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అప్పు తీసుకునే వెసులుబాటు కూడా లేని క్లిష్ట పరిస్థితుల నుంచి రాష్ట్రాన్ని బయటకు తీసుకొచ్చామని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ పథకాల ద్వారా సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా వేగవంతం చేయగలిగామని తెలిపారు. గత ఏడాదిన్నర కాలంలో సాధించిన ప్రగతిని వివరించిన సీఎం, "తల్లికి వందనం పథకం ద్వారా 67 లక్షల మంది విద్యార్థుల



2 లో..



## అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్‌లో

# ప్రధాని మోడీ

- అతిథికి భారత సంస్కృతి పరిచయం
- గాలిపటం ఎగరేసిన జర్మనీ ఛాన్సలర్
- ప్రపంచానికి సందేశంగా నిలిచిన పండుగ

మన గళం, అహ్మదాబాద్ : అహ్మదాబాద్ నగరం మరోసారి రంగులు, ఉత్సాహంతో నిండిపోయింది. అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్ సందర్భంగా ఆకాశమంతా గాలిపటాలతో కళకళలాడింది. ఈ ప్రత్యేక వేడుకలో నరేంద్ర మోడీ పాల్గొని పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విదేశీ అతిథులకు భారత సంప్రదాయాలను పరిచయం చేసే వేదికగా

2 లో..

## రైల్‌గన్ అభివృద్ధిలో

# భారత్ కీలక అడుగు




- ☐ పేలుడు పదార్థాలు లేకుండానే లక్ష్యాలపై దాడి
- ☐ 150--200 కిలోమీటర్ల దూరం వరకూ ఖచ్చితమైన దెబ్బ
- ☐ మోదీ నేతృత్వంలో రక్షణ రంగంలో స్వదేశీ విప్లవం



మన గళం, న్యూఢిల్లీ : భవిష్య త్ యుద్ధాల స్వరూపాన్ని మార్చే అత్యాధునిక ఆయుధ సాంకేతి కత వైపు భారత్ వేగంగా అడుగులు వేస్తోంది. ఎలక్ట్రో మ్యాగ్నెటిక్ శక్తితో పనిచేసే రైల్‌గన్ అభివృద్ధిలో భారత్ కీలక దశకు చేరుకుంది. ఈ అత్యాధునిక ఆయుధ వ్యవస్థ అభివృద్ధి వెనుక గౌరవ ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో కొనసాగుతున్న స్వదేశీ రక్షణ విధానాలే

2 లో..

## కర్నూలుకు హైకోర్టు బెంచ్ రావడం ఖాయం




- సీఎం నారా చంద్రబాబు నాయుడు,మంత్రి నారా లోకేష్ తో దీనిపై చర్చిస్తూనే ఉన్నా
- నిబంధనల మేరకు హైకోర్టు బెంచ్ ప్రక్రియ జరుగుతూనే ఉంది
- ఏ, బీ, సి క్యాంపుల్లో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం
- హైకోర్టు బెంచ్ తో పాటు కలెక్టరేట్ భవనం కూడా ఏర్పాటు చేస్తాం
- కర్నూలు అడ్వకేట్ల సంక్రాంతి వేడుకల్లో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ న్యాయవాదుల సంక్షేమమే..నా ధ్యేయం
- వారి సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా ముందుంటా
- న్యాయవాదులు,వారి కుటుంబ సభ్యులకు ఇన్సూరెన్స్ సదుపాయం వర్తించేలా చూస్తా
- ప్రభుత్వ ప్లీడర్ యలమంజుల బాలాజీ

2 లో..

## 'నా అన్వేషణ'కు బ్రేక్.. ట్రావెల్ కెరీర్‌కు స్వస్తి పలికిన అన్వేష్



- వివాదాల నడుమ సంచలన నిర్ణయం
- వ్యూస్--ఆదాయం కోసం ఇక ప్రయాణాలు లేవు
- సామాజిక అంశాలపై దృష్టి పెట్టనున్నట్లు ప్రకటన

హైదరాబాద్, జనవరి 12 మన గళం, : తెలుగు యూట్యూబ్ ప్రపంచంలో ట్రావెల్ కంటెంట్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న 'నా అన్వేషణ' చానెల్ నిర్వాహకుడు అన్వేష్ తన ప్రొఫెషనల్ ట్రావెలింగ్ కెరీర్‌కు స్వస్తి పలుకుతున్నట్లు ప్రకటించాడు. ఈ విషయాన్ని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వెల్లడించిన ఆయన, ఇకపై వ్యూస్ లేదా యూట్యూబ్ ఆదాయం కోసం దేశాలు తిరగబోనని స్పష్టం చేశారు.ఇటీవల ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు, నటుడు శివాజీపై అన్వేష్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారి తీశాయి. ఈ వివాదం నేపథ్యంలో చానెల్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య గణనీయంగా తగ్గడంతో పాటు, హిందూ సంఘాల నుంచి కేసులు నమోదయ్యాయి. ఈ పరిణామాలే తన నిర్ణయానికి కారణమై ఉండొచ్చని వర్గాలు భావిస్తున్నాయి. సుమారు 130 దేశాలు చుట్టేసి లక్షలాది మంది సబ్‌స్క్రైబర్లను సంపాదించిన అన్వేష్, ఇప్పటివరకు దాదాపు రూ.8 కోట్లు సంపాదించానని వెల్లడించాడు. జీవితాంతం సంతోషంగా జీవించడానికి ఆ మొత్తమే చాలని, ఇకపై వ్యక్తిగత సంతృప్తి కోసం మాత్రమే మిగిలిన దేశాలు సందర్శిస్తానని చెప్పాడు.

## దివ్యాంగులు ఆత్మగౌరవంతో

# నిలబడాలి

- మానవీయ కోణంతో ప్రభుత్వం : సీఎం రేవంత్ రెడ్డి
- దివ్యాంగులకు రూ.50 కోట్లతో సహాయ ఉపకరణాల పంపిణీ
- వృద్ధుల కోసం ప్రణామ్ డే కేర్ కేంద్రాలు
- సమాన అవకాశాలు, సామాజిక న్యాయమే ప్రభుత్వ ధ్యేయం



మన గళం, హైదరాబాద్ : సమాజంలో దివ్యాంగులు ఆత్మగౌరవంతో, ఆత్మవిశ్వాసంతో జీవించే విధంగా సహాయ సహకారాలు అందించడంలో ప్రభుత్వం మానవీయ కోణంతో పనిచేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్

2 లో..

## సుమన్ టీవీ-2026 క్యాలెండర్ ను ఆవిష్కరించిన మంత్రి టి.జి.భరత్

కర్నూలు,మన గళం, నరసింహారెడ్డి నగర్) : సుమన్ టీవీ-2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను రాష్ట్ర మంత్రి టి.జి.భరత్ ఆవిష్కరించారు. ఆదివారం నగరంలోని స్థానిక నరసింహారెడ్డి నగర్ లో ఉన్న హీరా ఇన్ సర్వీస్ అపార్ట్ మెంట్స్ లో ఉన్న సుమన్ టీవీ స్టూడియోను మంత్రి టి.జి.భరత్ సందర్శించారు. ఈ సందర్భంగా సుమన్ టీవీ నూతన సంవత్సరం క్యాలెండర్ ను మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సుమన్ టీవీ కర్నూలు,మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లాల ఫ్రాంఛైజీ పార్ట్ నర్ నగరూరు రాఘవేంద్ర, వైస్ ప్రెసిడెంట్ మధుసూదన్ రావ్, కర్నూలు ఉమ్మడి జిల్లాల సుమన్ టీవీ ఇంఛార్జ్ కిరణ్ కుమార్, సీనియర్ కరెస్పాండెంట్ యస్.బి.నందకిషోర్, ,నంద్యాల ఇంఛార్జ్ మహబూబ్ భాష, యాంకర్ పల్లె హర్షవర్ధన్, యాంకర్ రామాంజి,తదితరులు పాల్గొన్నారు.



## అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్‌లో ప్రధాని మోడీ

ఈ ఉత్సవం నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ, జర్మనీ ఛాన్సలర్ ను అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్‌కు తీసుకువచ్చారు. భారతదేశ సంస్కృతి, ప్రజల ఆతిథ్యం, పండుగల వైవిధ్యం ప్రపంచాన్ని ఆకట్టుకుంటాయని మోడీ తెలిపారు. అహ్మదాబాద్‌లోని పండుగ వాతావరణం అతిథులను విశేషంగా ఆకర్షించిందని చెప్పారు. ప్రత్యేకంగా ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్ స్వయంగా గాలిపటం ఎగరేయడం అక్కడి ప్రజల్లో ఉత్సాహాన్ని నింపింది. సంప్రదాయ పండుగల్లో విదేశీ నేతల భాగస్వామ్యం దేశాల మధ్య సాంస్కృతిక అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని ప్రధాని అభిప్రాయపడ్డారు. ఈ దృశ్యాలు అక్కడ ఉన్నవారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్ ద్వారా గుజరాత్ సంస్కృతి, భారతీయ సంప్రదాయాలు ప్రపంచ దేశాలకు చేరుతున్నాయని అధికారులు తెలిపారు. ప్రతి ఏడాది ఈ ఉత్సవం విదేశీ పర్యాటకులను ఆకర్షిస్తూ, భారత్ సాఫ్ట్ పవర్‌కు ప్రతీకగా నిలుస్తోందని విశ్లేషకులు పేర్కొన్నారు.

## రైల్‌గన్ అభివృద్ధిలో భారత్ కీలక అడుగు



ప్రధాన బలంగా నిలుస్తున్నాయని రక్షణ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ రైల్‌గన్ వ్యవ స్థ పేలుడు పదార్థాలు ఉపయోగించకుండా, పూర్తిగా విద్యుత్ శక్తి మరియు భౌతిక శాస్త్ర సూత్రాల ఆధారంగా పనిచేస్తుంది. రెండు లోహ రైళ్ల మధ్య ఏర్పడే ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ బలంతో ప్రొజెక్టైల్‌ను అతి వేగంగా ముందుకు నెట్టడం దీని ప్రత్యేకత. ఈ విధానం ద్వారా శబ్ద వేగానికి ఆరు రెట్లు అధికంగా ప్రయాణించే ప్రొజెక్టైల్‌ను ప్రయోగించవచ్చు. దీని దాడి పరిధి 150 నుంచి 200 కిలోమీటర్ల వరకు ఉంటుందని అంచనా. ఈ ప్రాజెక్టు అభివృద్ధిని రక్షణ పరిశోధనాభివృద్ధి సంస్థకు చెందిన ఆర్మమెంట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ ముందుండి నడిపిస్తోంది. నౌకాదళం, భూసైన్యం అవసరాలకు అనుగుణంగా ఈ ఆయుధాన్ని రూపకల్పన చేస్తున్నారు. అతి వేగం, అధిక ఖచ్చితత్వం కారణంగా ఇది ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన పేలుడు లేని ఆయుధాల్లో ఒకటిగా నిలవనుంది. హైపర్‌సోనిక్ సాంకేతికత, కృత్రిమ మేధ, అంతరిక్షం, సైబర్ రంగాలతో పాటు రైల్‌గన్ అభివృద్ధిలో కూడా భారత్ ముందంజలో నిలవడం దేశ రక్షణ సామర్థ్యాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్లనుంది. ప్రపంచ శక్తులు భవిష్యత్ ఆధిపత్యం కోసం పోటీపడుతున్న ఈ సమయంలో, భారత్ భవిష్యత్తును ఎదురుచూడడం కాదు.. స్వయంగా నిర్మిస్తోందని ఈ ప్రాజెక్టు స్పష్టంగా చాటుతోంది.

# దివ్యాంగులు ఆత్మగౌరవంతో నిలబడాలి






రెడ్డి స్పష్టం చేశారు. దివ్యాంగులు కుటుంబానికి భారమవుతున్నామన్న ఆత్మన్యూనతతో ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి దివ్యాంగులకు వివిధ సహాయ ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాల భరోసా కార్యక్రమాన్ని ప్రారంభించడంతో పాటు, వయోవృద్ధుల సంక్షేమం కోసం 'ప్రణామ్ణ పేరుతో డే కేర్ కేంద్రాలను వర్చువల్‌గా ఆవిష్కరించారు. దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ప్రభుత్వం గతంలో ఎప్పుడూ లేనివిధంగా రూ.50 కోట్లు కేటాయించిందని సీఎం వెల్లడించారు.

విద్య, ఉద్యోగాల్లో దివ్యాంగులకు అవసరమైన రిజర్వేషన్లు కల్పించడంతో పాటు, దివ్యాంగులు దివ్యాంగులు వివాహం చేసుకుంటే రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందించాలన్న నిర్ణయం తీసుకున్నామని సీఎం తెలిపారు. క్రీడల్లో దివ్యాంగులు రాణించేలా అన్ని విధాల ప్రోత్సాహం అందిస్తున్నామని, పారా ఒలింపిక్స్‌లో ప్రతిభ చూపిన దివ్యాంగ యువతికి ఉద్యోగం కల్పించినట్లు గుర్తుచేశారు. దివ్యాంగులు ఆత్మస్థైర్యం కోల్పోకుండా ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ట్రాన్స్‌జెండర్ల విషయంలో కూడా ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తోందని సీఎం చెప్పారు. వారికి ఉద్యోగాలు, ఇందిరమ్మ ఇళ్లు కేటాయించడంతో పాటు, మున్సిపల్ కార్పొరేషన్లలో కో ఆప్షన్ సభ్యులుగా ప్రాతినిధ్యం కల్పించే అంశాన్ని మంత్రివర్గ సమావేశంలో చర్చించాలని సూచించారు. అలాగే వృద్ధుల సంక్షేమం కోసం దేశంలోనే తొలిసారిగా ప్రభుత్వం కుటుంబ పెద్దగా మారి డే-కేర్ కేంద్రాలను ప్రారంభిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనరసింహ, సీతక్క, ఆద్లూరి లక్ష్మణ్ కుమార్తో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# విధ్వంసం నుంచి సుపరిపాలన దిశగా రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం




తల్లుల ఖాతాల్లో రూ.10,090 కోట్లు జమ చేశాం. స్త్రీశక్తి పథకం కింద మహిళలు 3.5 కోట్ల ఉచిత ప్రయాణాలు చేయగా, ఇందుకు రూ.1,114 కోట్లు వెచ్చించాం. అన్నదాత సుఖీభవ ద్వారా 46 లక్షల రైతులకు రూ.6,310 కోట్లు, దీపం 2.0 కింద 2 కోట్ల గ్యాస్ సిలిండర్ల పంపిణీకి రూ.2,684 కోట్లు ఖర్చు చేశాం. ఏడాదిన్నరలోనే రూ.50 వేల కోట్ల సామాజిక పెన్షన్లు అందించి సంక్షేమంలో కొత్త మైలురాయిని దాటాం" అని తెలిపారు.

**- పుష్కరాల్లోగా పోలవరం పూర్తి**

ప్రతిష్ఠాత్మక పోలవరం ప్రాజెక్టును రాబోయే పుష్కరాల్లోగా పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని సీఎం స్పష్టం చేశారు. పోలవరం పూర్తయితే దక్షిణ భారతదేశంలో ఏ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌తో పోటీపడలేదన్నారు. ఏటా సుమారు 3 వేల టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో వృథగా కలుస్తున్నాయని, పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీరు అందించి శ్రీశైలంలో జలాన్ని ఆదా చేసి రాయలసీమకు తరలిస్తున్నామని వివరించారు. నల్లమల సాగర్ ద్వారా రాయలసీమ, ప్రకాశం జిల్లాలకు నీరు అందించవచ్చని, పోలవరంలో మిగిలిన నీటిని తెలంగాణ కూడా వినియోగించుకోవచ్చని సూచించారు.

**- పెట్టుబడులకు ఏపీ గమ్యస్థానం**

రాష్ట్రం పెట్టుబడులకు దేశంలోనే ప్రధాన గమ్యస్థానంగా మారిందని చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం ఆంధ్రప్రదేశ్‌కే రావడం గొప్ప విజయమన్నారు. గూగుల్ సంస్థ విశాఖలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోందని, ఎస్ఐపీబీ ద్వారా రూ.8.74 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపామని తెలిపారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అని, కేంద్రం సహకారంతో రూ.12 వేల కోట్లతో ఆ ప్లాంటును కాపాడుకున్నామని గుర్తుచేశారు. గత ఏడాది 12 శాతానికి పైగా వృద్ధి సాధించామని, ఈసారి 16 శాతం వృద్ధి లక్ష్యంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. కలియుగ వైకుంఠమైన తిరుమల పవిత్రతను దెబ్బతీయడానికి జరుగుతున్న ప్రయత్నాలపై సీఎం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దేవుడితో కూడా రాజకీయం చేయడం బాధాకరమని, కల్తీ నెయ్యితో ప్రసాదాలు తయారు చేయడం, తిరుమలలో ఖాళీ మద్యం సీసాలు పెట్టడం వంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. ఈ ఏడాది భూ రికార్డుల ప్రక్షాళన పూర్తిచేసి, రిజిస్ట్రేషన్ ప్రక్రియను సాంకేతికతతో పూర్తిగా పారదర్శకంగా మారుస్తామని తెలిపారు. సవాళ్లను అధిగమిస్తూ 2026ను రాష్ట్రానికి అత్యుత్తమ సంవత్సరంగా నిలిపేందుకు మంత్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని సీఎం పిలుపునిచ్చారు.

# కర్నూలుకు హైకోర్టు బెంచ్ రావడం ఖాయం






(కర్నూలు నరసింహారెడ్డి నగర్) : కర్నూలుకు హైకోర్టు బెంచ్ రావడం ఖాయమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆదివారం నగరంలోని స్థానిక నరసింహారెడ్డి నగర్ లో ఉన్న హీరా ఇన్ బాంకెట్ హాల్ లో కర్నూలు న్యాయవాదుల సంక్రాంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు,మంత్రి నారా లోకేష్ తో ఈ విషయంపై చర్చిస్తూనే ఉన్నానని ఆయన స్పష్టం చేశారు. నిబంధనల మేరకు హైకోర్టు బెంచ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. నగరంలోని ఏ,బి,సి క్యాంపుల్లో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని,హైకోర్టు బెంచ్ ఏర్పాటుతో పాటు కలెక్టరేట్ భవనం సైతం ఏర్పాటు చేస్తామన్నారు. న్యాయవాదులకు అన్ని విషయాలపై మంచి అవగాహన ఉంటుందన్నారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆయన చెప్పారు. పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమలపై వైసిపి చేస్తోన్న చిల్లర చేష్టలు ఇకనైనా ఆపాలన్నారు. తిరుమల పవిత్రతను కాపాడేందుకు తమ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. తమ ప్రభుత్వంపై బురదజల్లేందుకు వైసిపి ఆడిన మద్యం బాటిల్స్ నాటకం బయటపడిందన్నారు. టెక్నాలజీని ఉపయోగించి ఈ బండారం బయటపెట్టామన్నారు. అయితే..ఇలా దొరికిపోతారని వైసీపీ నేతలు ఊహించి ఉండరన్నారు. 11 సీట్లు వచ్చినా వైసీపీ నేతలు మారడం లేదని, ప్రజలకు దగ్గరవ్వాలనే ఆలోచన వారికి లేదన్నారు. ఇలాంటి తప్పుడు పనులను తమ ప్రభుత్వం సహించబోదన్నారు. న్యాయవాదుల ఎన్నికల్లో ప్రభుత్వ ప్లీడర్ యలమంజుల బాలాజీకి మద్దతివ్వాలన్నారు. అనంతరం ప్రభుత్వ ప్లీడర్ బాలాజీ మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమానికి తాను శ్రమిస్తానన్నారు. కర్నూలు,విజయవాడ కేంద్రంగా న్యాయవాద భవన్ ఏర్పాటుకు యత్నిస్తామన్నారు. న్యాయవాదలు సంక్షేమ నిధిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచేందుకు శ్రమిస్తానన్నారు. న్యాయవాదులకు, వారి కుటుంబాలకు ఇన్స్యూరెన్స్ సదుపాయం వర్తించేలా చూస్తామన్నారు. అనంతరం ప్రభుత్వంచే నూతనంగా నియమించబడిన పి.పి.లు, జి.పి.లకు మంత్రి టి.జి.భరత్ శాలువాలు కప్పి,సత్కరించారు. అంతకు ముందు మంత్రి టీజీ భరత్ కు న్యాయవాదులు ఘన స్వాగతం పలికారు. ఏ.పి.ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ డైరెక్టర్, భాజపా నేత నగరూరు రాఘవేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ ప్లీడర్ బాలాజీ పట్టువదలని విక్రమార్కుడన్నారు. నిరంతరం న్యాయవాదుల శ్రయస్సుకు శ్రమించే నాయకుడన్నారు. బాలాజీ పదవి కోసం పాకులాడే నేత కాదని, ఆయన న్యాయవాదుల సంక్షేమాన్ని కాంక్షించే వ్యక్తి అని చెప్పారు. తనకు ఏ.పీ,తెలంగాణాల్లో విపరీతమైన క్రేజ్ ఉందన్నారు. నిగర్వి, నిరాడంబరుడైన బాలాజీని మనమందరం కలిసికట్టుగా ఈ ఎన్నికల్లో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి లీగల్ సెల్ అధ్యక్షుడు జగదీష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరినాథ్ చౌదరి, బొందిలి సంక్షేమ సంఘం ఛైర్మెన్ విక్రం సింగ్, కర్నూలు మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్ పర్సన్ నగరూరు శమంతకమణి, న్యాయవాదులు లోకేష్, కోటి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి ఫిర్యాదుకు సత్వరమే పరిష్కారం

– నగరపాలక డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే ప్రతి ఫిర్యాదుకు సత్వరమే పరిష్కారం చూపాలని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి ఆదేశించారు. సోమవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో పీజీఆర్‌యస్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ విభాగాలకు సంబంధించి 21 అర్జీలు రాగా, వాటిని చట్టపరిధిలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ అర్జీదారులకు హామీనిచ్చారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, ఎస్ఈ రమణ మూర్తి, ఎంఈ మనోహర్ రెడ్డి, డిసిపి వెంకటరమణ, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగశివ ప్రసాద్, ఆర్ఓ జునైద్, టిడ్కో అధికారి పెంచలయ్య, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# మనం చేసే ప్రతి పని మంచిగా ఉండాలి

మనగళం, కర్నూలు సిటీ : మనం చేసే ప్రతి పని మంచిగా ఉండాలని సమాజం బాగు కోసం ప్రయత్నించాలని జనతా ఫౌండేషన్ వ్యవస్థాపకులు కొత్తూరు సత్యనారాయణ గుప్తా తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ హైందవ ధర్మం అనేది భారతదేశంలో పుట్టిన ప్రాచీన ధర్మం. ఇది ఒక మతం మాత్రమే కాదు, ఒక జీవన విధానం అన్నారు. మనిషి ఎలా జీవించాలి, ఎలా ఆలోచించాలి, ఎలా ప్రవర్తించాలి అనే విషయాలను హైందవ ధర్మం బోధిస్తుందని తెలిపారు. హైందవ ధర్మంలో సత్యం, ధర్మం, అహింస, కరుణ వంటి విలువలకు ఎక్కువ ప్రాధాన్యం ఉందని తెలిపారు. మనం చేసే ప్రతి పని మంచిగా ఉండాలి అనే భావనను ఇది చెబుతుంది. "ధర్మంగా జీవించు" అనేది హైందవ ధర్మం యొక్క ముఖ్య సందేశం అని తెలిపారు. ఈ ధర్మంలో వేదాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలు, పురాణాలు ముఖ్యమైన గ్రంథలు. రామాయణం, మహాభారతం వంటి గ్రంథలు మనకు మంచి జీవన మార్గాన్ని చూపిస్తాయి కానీ పాటించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాముడు, కృష్ణుడు వంటి ఆదర్శ వ్యక్తులు ధర్మం ఎలా పాటించాలో నేర్పించారు. హైందవ ధర్మం అన్ని మతాలను గౌరవిస్తుంది. ప్రతి వ్యక్తి తన నమ్మకానికి అనుగుణంగా దేవుడిని ఆరాధించవచ్చని ఇది చెబుతుందన్నారు. అందుకే ఇందులో అనేక దేవతలు, అనేక పూజా విధానాలు ఉన్నాయి. ప్రకృతి పట్ల గౌరవం కూడా హైందవ ధర్మంలో ముఖ్యమైనది తెలిపారు. నదులు, చెట్లు, జంతువులను పవిత్రంగా భావిస్తారు. ఇది మనకు ప్రకృతిని కాపాడుకోవాలని బోధిస్తుంది, ఆచరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మొత్తంగా చెప్పాలంటే, హైందవ ధర్మం మంచి మనిషిగా మారేందుకు దారి చూపే ధర్మం. శాంతి, ప్రేమ, సహనం, సేవ అనే విలువలతో జీవించమని ఇది మనకు నేర్పుతుందని, సనాతన ధర్మం గురించి పాఠశాలలో కళాశాలలో తెలపాల్సిన అవసరం ఎంతైనా ఉందని అని చెప్పారు.



# హంద్రీ నదిని కాపాడండి

మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు నగరంలోని హంద్రీ నది ఆక్రమణ నుండి కాపాడాలని సిపిఎం పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు, ఎస్ ఎం డి షరీఫ్ ,కె రామకృష్ణ, నగర కమిటీ సభ్యులు పి మహమూద్ బాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కర్నూలు కలెక్టరేట్ లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు వినతి పత్రం సమర్పించారు. కర్నూలు నగరంలోని లక్ష్మీపురం నుండి జోహరాపురం వరకు దాదాపు పది కిలోమీటర్ల మేరా హంద్రీ నది ప్రవహిస్తుందని వారు తెలియజేశారు. నగరం నడిబొడ్డున ప్రవహిస్తుండడంతో న గరవాసులకు గతంలో అహ్లాదాన్ని పంచేదని రోజు రోజుకి ఆక్రమణల కు కబ్జాలకు గురవుతూ ప్రస్తుతం ఆక్రమణ కోరాల్లో చిక్కుకుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గాజులదిన్నె ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయిన తర్వాత ఆక్రమణల ప్రక్రియ పరంపర పెరిగిందని వారు వివరించారు. నదీ సరిహద్దులు మాయం అయ్యాయని, హంద్రీ నది పూడ్చి వేయడం బహిరంగంగా జరుగుతూ ఉన్న అధికారులు కళ్ళు అప్పగించి చూస్తున్నారే తప్ప ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. రాజకీయ నాయకుల వత్తిళ్లతో నోరు విప్పలనీ పరిస్థితుల్లో ఉన్నారని అధికారులపై దుమ్మెత్తి పోశారు. నగరంలో హంద్రీ కబ్జాలకు గురవుతూ ఉంటే హంద్రీ పరిసర ప్రాంతాల దాదాపు 50 గ్రామాల ప్రజలు అక్రమ ఇసుక త్రవ్వకాలతో నదిని అస్తిపంజరంగా మార్చేస్తున్నారని వారు ఆరోపించారు. నగరపాలక సంస్థ అధికారులు పాకెట్ పార్కు నిర్మిస్తే దాని పక్కనే డివైడర్ తొలగించి మట్టిని హంద్రీలో వేసి చదును చేసి అధికార పార్టీ ప్రజాప్రతినిధికి అనుచరుడిగా చెప్పుకుంటున్న ఓ వ్యక్తి గత కొన్ని రోజులుగా టీ దుకాణం ఏర్పాటు చేశారని ఆరోపించారు. దీనిపై అధికారులు సమాధానం చెప్పాలి డిమాండ్ చేశారు. న దిలో వ్యర్థాలను తెచ్చి వేస్తూ చదువును చేస్తూ ఆక్రమణకు పాల్పడుతున్న జనవనరుల శాఖ, నగరపాలక సంస్థ, పర్యావరణ పరిరక్షణ, కాలుష్యం యంత్రల మండలి ఏం చర్యలు తీసుకుంటున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# రైతు సంఘం నేత అప్పలరాజుపై పీడీ యాక్ట్ ను ఎత్తి వేయాలి


మనగళం, కర్నూలు సిటీ : అనకాపల్లి జిల్లా రైతు నాయకుడు ఎం అప్పలరాజు పై అక్రమంగా పెట్టిన పీడీ చట్టాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు రైతు సంఘం, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డిఆర్ఓ రామనాయక్ కు అందజేశారు. కార్యక్రమం లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఏ .రాజశేఖర్, టి. రామచంద్రుడు, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, సుబ్బరాయుడు, సహాయ కార్యదర్శులు ఏ. సురేష్, వీరన్న, జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్, గురెడ్డి, హిమం హుస్సేన్, సిఐటియు నాయకులు కేఎండి గౌస్, లక్ష్మణ్, సుబ్బారావు, గోపాల్,జైలాన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నరసింహ నాయక్, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షులు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ , గంజాయి రహిత సమాజాన్ని నిర్మించుకుందాం




మనగళం, కర్నూలు సిటీ : ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సుందరయ్య సర్కిల్ నందు స్వామి వివేకానంద జయంతి సందర్భంగా డ్రగ్స్, గంజాయి రహితసమాజాన్ని నిర్మించుకుందామని నిరసన కార్యక్రమం ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా అధ్యక్షుడు సాయి ఉదయ్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆనంద్ బాబు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, ఐద్వా జిల్లా కార్యదర్శి అరుణమ్మ, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి రాజు, రజక సంఘం జిల్లా కార్యదర్శి గురు శేఖర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గోపాల్ మాట్లాడారు. స్వామి వివేకానంద స్ఫూర్తితో డ్రగ్స్, గంజాయి రహిత సమాజాన్ని నిర్మించుకుందాం, యువతరాన్ని కాపాడుకుందాం అని అన్నారు. ప్రస్తుతం దేశంలో విద్యార్థులపై మరియు యువతి యువకులపై డ్రగ్స్ మరియు గంజాయి వంటి మత్తు పదార్థాల యొక్క ప్రభావం అధికంగా ఉందన్నారు. దీనిని నిర్మూలించేందుకు ప్రజా సంఘాలు డ్రగ్స్, గంజాయి అంతం – ప్రజాసంఘాల పంతం అని పేరుతో యువతి యువకులను చైతన్య పరిచేందుకు కృషి చేస్తుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు డ్రగ్స్ ను గంజాయిని నిర్మిల్లిస్తున్నామని చెప్పి ప్రకటనల కోసం ఆర్భాటాలు చేస్తున్నారే తప్ప నిర్మూలించడంలో విఫలమవుతున్నారు. డ్రగ్స్ తీసుకొని యువత పక్కదారి పడుతూ తమ జీవితాన్ని కోల్పోతున్నారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల చాలా కుటుంబాలు నష్టపోతున్నాయన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు డ్రగ్స్ గంజాయిని పూర్తిగా నిర్మూలించాలని కోరారు. లేకపోతే ప్రజా సంఘాలను కలుపుకొని డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకోవడం కోసం పోరాటాల నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు అలివేలమ్మ, శ్యామలమ్మ, వేణమ్మ డివైఎఫ్ఐ నాయకులు హుస్సేన్ భాష , శిరీష, వీరేష్ ప్రజానాట్యమండలి నాయకులు చిట్టి, రాంబాబు,శేషన్న, మద్దిలేటి కెవిపిఎస్ నాయకులు భాస్కర్, ఎస్ఎఫ్ఐ నాయకులు ఆర్యన్, రమేష్, యోగి సిఐటియు నాయకులు బతకన్నా మరియు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.ఖ

# ప్రజా సంక్షేమమే ధ్యేయం



మనగళం, కర్నూలు సిటీ : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. ఎమ్మిగనూరు మండలం బనవాసి గ్రామానికి చెందిన కురువ శ్వేతకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని ఆయన పంచలింగాలలోని తన స్వగృహంలో అందజేశారు. శ్వేత గత కొద్ది రోజుల కిందట అనారోగ్యానికి గురై ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంది. అనంతరం వైద్య ఖర్చుల కోసం ఎంపీ నాగరాజు ను సంప్రదించి, ఆయన సిఫార్సు తో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా రూ.1,16,553 మంజూరు అయ్యాయి. ఈ మేరకు లబ్దిదారురాలికి సి.ఎం.ఆర్.ఎఫ్ చెక్కును అందజేసిన ఎంపీ, ఆపదలో ఉన్న వారికి సీ.ఎం చంద్రబాబు అండగా నిలుస్తున్నారని తెలిపారు.

# వైసీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి




మనగళం, కర్నూలు సిటీ : వైసీపీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. వైసీపీ కర్నూలు జిల్లా స్థాయి సంస్థాగత నిర్మాణ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు గ్రామ స్థాయి నుండి పట్టణ స్థాయి వరకు కమీటిలను ఏర్పాటు చేయాలి అని తెలిపారు. దీనిపై ప్రత్యేక దృష్టి సాధించాలి, పార్టీ నాయకులు ఉత్సాహం తో పని చేయాలి భాగస్వామ్యం కావాలి అన్నారు. కర్నూలు టౌన్ లో పాణ్యం వార్డులో కమీటిలను ఏర్పాటు చేస్తాం. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రెవెంత్ రెడ్డి వ్యాఖ్యలపై సీమ వాసులు స్పందించాలని కోరారు. సీమ కు రావాల్సిన 44 క్యూసెక్కుల నీటిని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అందించాలి సంకల్పం చేశారని గుర్తు చేశారు. వరద నీటిని సీమ కు తరలించేందుకు రాయలసీమ ఎత్తిపోతల పథకం ప్రారంభం చేశారన్నారు. హంద్రీనీవా గాలేరు వంటివి దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి తీసుకొచ్చారని చెప్పారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండిస్తున్నాం అన్నారు. కూటమి ప్రభుత్వంలో గుండేవుల రిజర్వాయర్ ను పూర్తి చేసుకోవాలని డిమాండ్ చేస్తాం. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తప్పకుండా గుండ్రేవుల పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. గుండ్రేవుల రిజర్వాయర్ పై కూడా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గా పర్యటించి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తాం. మన సీమ కు కర్నూలు జిల్లా సాగు త్రాగు నీరు కోసం పోరాటం చేస్తాం. శ్రీశైలం జలాశయంలో డెడ్ స్టోరేజ్ ఉన్న తెలంగాణ ప్రభుత్వం నీటి తరలిస్తుంది. దీనిని పై పోరాటం చేయాల్సిన అబశ్రీశ్రీసమయం వస్తుందన్నారు. సాగు నీటి ప్రాజెక్టుల పై ఒక్కసారిగా చర్చించి కలిసి పోరాటం చేస్తాం అన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసేందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కష్టపడి కృషి చేయాలి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి (సమన్వయం) చల్లా మధుసూదన్ రెడ్డి, కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి, కర్నూల్ పార్లమెంట్ పరిశీలకుడు గంగుల ప్రభాకర్ రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్తలు సాయి ప్రసాద్ రెడ్డి, కంగాటి శ్రీదేవి, బుట్టా రేణుక, ఎమ్మెల్సీ మధుసూదన్, రాష్ట్ర కార్యదర్శులు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# స్వామి వివేకానంద స్ఫూర్తితో రాష్ట్రంలో పాలన

మనగళం, కర్నూలు సిటీ : స్వామి వివేకానంద స్ఫూర్తితో సీఎం చంద్రబాబు పాలన సాగిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పరుస్తున్నారని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నగరంలోని రాజ్ విహార్ సర్కిల్ వద్ద ఉన్న వివేకానంద విగ్రహానికి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డితో కలిసి ఆయన పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు మాట్లాడుతూ స్వామి వివేకానంద ఆశయాలను ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. యువత నైపుణ్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సెట్కూరు సీ.ఈ.ఓ డాక్టర్ వేణుగోపాల్, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## గుండ్రేవుల ప్రాజెక్టును నిర్మించాలి




మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు నగరంలో కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కర్నూలు జిల్లా డిప్యూటీ కలెక్టర్ కొండలరావును రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రాయలసీమ రవికుమార్, రాయలసీమ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మాదాసి కురువ సుంకన్న కలిసి గుండ్రేవుల ప్రాజెక్టును నిర్మించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాయలసీమ రవికుమార్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో ప్రవహించే తుంగభద్ర నదిపై గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ దశాబ్దాల కాలంగా ఉందకన్నారు. అయితే 2019లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2,890కోట్ల నిధులతో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని 21-02-2019తేదీన జీవో నెంబర్ 154ద్వారా ఉత్తర్వులు జారీ చేశారని గుర్తు చేశారు. అయితే ఇప్పటికీ ప్రాజెక్టు నిర్మాణానికి నోచుకోలేదని గుండ్రేవుల ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టడం ద్వారా రాయలసీమ జిల్లాల్లో కరువు,వలసలను నివారించవచ్చునని రాయలసీమలో దాదాపు రెండు లక్షల 50వేల ఎకరాలకు సాగునీరు వందలాది గ్రామాలకు తాగునీరు లభించే అవకాశం ఉందన్నారు. ప్రతి సంవత్సరం తుంగభద్ర నది ద్వారా సముద్రం పాలవుతున్న వందలాది టిఎంసిల నీటిని కాపాడుకోవడానికి రాయలసీమ ప్రాంతాన్ని కరువు,వలసల నుండి రక్షించుకోవడానికి తుంగభద్ర నదిపై గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణం ద్వారానే సాధ్యమవుతుందని అన్నారు. తెలంగాణలో వివిధ పార్టీలకు చెందిన కొంతమంది నాయకులు గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణం జరగకూడదని మాట్లాడుతున్నారని, కృష్ణానదిపై అనేక నీటి ప్రాజెక్టులను,ఎత్తిపోతల పథకాలను నిర్మించుకొని నీటిని తీసుకు వెళ్తున్న రాయలసీమ ప్రాంత ప్రజలు తెలంగాణ సస్యశ్యామలం కావాలనే కోరుకున్నారని అయితే కరువు, వలసలు,రైతుల ఆత్మహత్యలతో నలుగుతున్న రాయలసీమ ప్రాంతానికి ప్రాజెక్టుల నిర్మాణం అత్యవసరమని గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణం జరిగితే తెలంగాణకు కూడా నీళ్లు వెళతాయని ఈ విషయాన్ని తెలంగాణ నాయకులు కొందరు గుర్తించకుండా ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టాలని చూడటం అన్యాయమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని గుండ్రేవుల ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి రాబోయే బడ్జెట్ కేటాయింపుల్లోని రాయలసీమ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి గుండ్రేవుల నిర్మాణం చేపట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ విద్యార్థి పోరాట సమితి నాయకులు కే.రాము, మదాసి సురేష్, భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఓబీసీ మోర్చా మండల అధ్యక్షునిగా శేఖర్ ఆచారి నియామకం

మనగళం, కల్లూరు : భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఉల్చాల లక్ష్మణ్ నాయుడు ఆదేశాల మేరకు, కల్లూరు అర్బన్-1 మండల అధ్యక్షునిగా కె. శేఖర్ ఆచారిని నియమించినట్లు పాణ్యం అసెంబ్లీ ఓబీసీ మోర్చా ఇంచార్జ్ మరియు జిల్లా ఉపాధ్యక్షుడు పి. తేజా రామ్ తెలిపారు. సోమవారం కల్లూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఈ నియామక పత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా తేజా రామ్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి, ఓబీసీల సంక్షేమానికి నూతన కమిటీ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు జిల్లా అంతటా కమిటీలను బలోపేతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నియామకం పట్ల స్థానిక బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా సెక్రటరీ రఘు, జిల్లా మీడియా కో-కన్వీనర్ సఫారే గోవిందు రాజు, బీజేపీ సీనియర్ నాయకుడు నాగరాజు, జిల్లా పార్టీ మండల అధ్యక్షుడు రామాంజనేయులు, కల్లూరు అర్బన్-1 నాయకులు పాల్గొన్నారు.



## ఉల్లి రైతులకు న్యాయం చేయాలి

మనగళం, కర్నూలు సిటీ : దేవనకొండ మండలంలో ఉల్లి రైతులకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారంలో భారీ అవకతవకలకు రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు పాల్పడ్డారని అదేవిధంగా నిజమైన ఉల్లి రైతులకు పరిహారం రాకుండా, ఇవ్వకుండా అధికారులు రైతులను బలి చేశారని వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి. వీరశేఖర్, రైతు సంఘం దేవనకొండ మండల కార్యదర్శి సూరి లు డిమాండ్ చేశారు. మండలంలోని గుడిమెరాళ్ల, బేతపల్లి, చెలమే చెలిమెల, కోటకొండ, బండపల్లి తదితర గ్రామాల రైతులు సోమవారం కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం దగ్గర తమకు జరిగిన అన్యాయానికి నిరసనగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఉల్లి రైతుల కష్టాలు తెలుసుకొని ఎకరుకు 50 వేల పరిహారం ప్రకటించగా దానిని నిజమైన రైతులకు కాకుండా అనర్హులకు క్షేత్రస్థాయి అధికారులు మళ్లించారని విమర్శించారు. మండలంలోని పలు గ్రామాల్లో నిజంగా ఉల్లి వేసిన రైతుల పంట నమోదు చేయకుండా రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేశారని, దానివలన తీవ్రంగా సంబంధిత రైతుల



నష్టపోయారని వారు వాపోయారు. ఇదే సందర్భంలో ఉల్లి వేయకుండా అధికారుల అక్రమాల తో చాలామంది ఉల్లి రైతులుగా నమోదు చేసుకుని ప్రభుత్వ పరిహారం పొందారని ఆరోపించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు వకీలు రంగన్న, ప్రకాష్ రెడ్డి, హనుమంతు,రెడ్డి, సురేంద్ర బాబు, మల్లి, భాస్కర్,జయుడు, వంశీ, శెట్టి గోపల్ ,సోమలింగ,షేక్ మొహమ్మద్ బాషా గజ్జెలు శ్రీనివాసులు,బోయ కిష్టన్న కౌలుట్లయ్య , ఆంజనేయ రంగడు తదితరులు పాల్గొన్నారు.

## స్వామి వివేకానందను యువత స్ఫూర్తిగా తీసుకోవాలి


**- జనసేన ఉమ్మడి కర్నూలు జిల్లా కోఆర్డినేటర్ చింతా సురేష్ బాబు**






మనగళం, కర్నూలు సిటీ : స్వామి వివేకానందుడి మాటలు తారకమంత్రంగా భావించి స్వశక్తితో ఎదిగే ప్రయత్నం చేస్తే యువత దేశానికి విలువైన సంపదగా నిలుస్తారని జనసేన పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా కోఆర్డినేటర్ చింత సురేష్ బాబు అన్నారు. సోమవారం స్వామి వివేకానందుని 163వ జయంతిని పురస్కరించుకొని కర్నూలు రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు నందు జనసేన సైనికులు రక్తదానం చేశారు. అనంతరం కర్నూల్ నగరం రాజ్ విహార్ కూడలిలోని స్వామి వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చింత సురేష్ బాబు మాట్లాడుతూ వివేకానందుడు చిన్న వయసులో పాశ్చాత్య దేశాలలో స్ఫూర్తిదాయక ఉపన్యాసాలు చేశారన్నారు. ఆయన ప్రసంగానికి మంత్రముగ్ధులైన విదేశీయులు వివేకానంద లాంటి వారు భారతదేశంలో ఉన్నారా అని ఆశ్చర్యపోయేవారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ తోళ్ళ మంజునాథ్, జనసేన పార్టీ జిల్లా ఐటీ వింగ్ కోఆర్డినేటర్ లక్ష్మి కాంత్ రెడ్డి, కొండల్, సుధాకర్, షబ్బీర్, నాగరాజు, రవి, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## అవుకు ఎస్ ఐ గా అశోక్



మన గళం అవుకు : అవుకు పోలీస్ స్టేషన్ ఎస్ ఐ గా అశోక్ సోమవారం బాధ్యతలు స్వీకరించినారు.కర్నూలు తాలూకా పోలీస్ స్టేషన్ లో గతం లో అశోక్ విధులు నిర్వహిస్తు బదిలీపై అవుకు కు వచ్చినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై అశోక్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని తీవ్రంగా హెచ్చరించారు. ప్రజలకు ఎప్పుడు ఎటువంటి సమస్య వచ్చిన తనకు తెలియచేయాలి అని ఆ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగింది.

## ఉపాధి కూలీల కడుపు కొట్టాలని కుట్ర



మనగళం, కర్నూలు సిటీ : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకానికి మహాత్మాగాంధీ పేరును తొలగించి ఉపాధి కూలీల కడుపు కొట్టాలని కేంద్ర ప్రభుత్వం చూస్తుందని కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు న్యాయవాది బి క్రాంతి నాయుడు విమర్శించారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు సోమవారం ధర్నా చౌక్ నందు కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఏర్పాటు చేసిన నిరాహార దీక్ష కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు సుధాకర్ బాబు దీక్ష ప్రతిజ్ఞ నాయకుకందరితో చేయించారు, అనంతరం దీక్ష ప్రారంభించారు. దీక్ష ను ఉద్దేశించి జిల్లా అధ్యక్షులు క్రాంతి నాయుడు బోయ మాట్లాడుతూ 20 సంవత్సరముల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం నాటి యూపీఏ చైర్ పర్సన్ సోనియా గాంధీ, నాటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్, నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి పేద ప్రజల జీవనోపాధి, వలసలు అరికట్టుటకు అనంతపురం జిల్లా బండ్లపల్లి గ్రామం నుండి పనికి ఆహార పథకం పేరుతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. నేటి బిజెపి ప్రభుత్వం ఆ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు పథకాన్ని విబి జి రాంజీ అను పేరుతో మార్పు చేయడం జరిగిందన్నారు. మోదీ ప్రభుత్వం కొత్త చట్టంలో కేంద్రం 60 శాతం రాష్ట్రాలు 40 శాతం ఆర్థిక భారాన్ని భరాయించాలని చట్టాన్ని తయారు చేశారని ఆరోపించారు. గతంలో రైతులను ఈ ప్రభుత్వము మోసం చేస్తే కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షాన నిలబడి పోరాటం చేసిందని, ఇప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీ తరపున ప్రతిజ్ఞ చేశామని ఈ పథకాన్ని యధావిధిగా కొనసాగించేంతవరకు కాంగ్రెస్ పార్టీ తరపున పోరాడుతామన్నారు. ముందుగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జాతీయ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, పార్లమెంటు సభ్యురాలు ప్రియాంక గాంధీ బర్త్ డే సందర్భంగా డిసిసి అధ్యక్షులు, నాయకులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. అనంతరం పార్టీ కార్యాలయం నుండి బయలుదేరి ధర్నా చౌక్ లో జరిగే నిరాహార దీక్షలో మహాత్మా గాంధీ గారి చిత్రపటమునకు పూలమాలలు వేసి డిసిసి అధ్యక్షులు క్రాంతి నాయుడు గారి ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. సాయంకాలం ఐదు గంటలకు సిపిఎం నాయకులు వెంకటనారాయణ, శేఖర్ నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప చేశారు. కార్యక్రమంలో సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని భాష, కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, ఐ ఎన్ టి యు సి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ పీర్ ఖాద్రి బాషా, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ ఎన్సి బజారన్న, ఓబీసీ సెల్ చైర్మన్ డివి సాంబశివుడు, మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బి మహేంద్ర నాయుడు, ఐఎన్టీయూసీ సిటీ అధ్యక్షులు రేపల్లె ప్రతాప్ కాంగ్రెస్ నాయకులు, పోతుల శేఖర్, రాఘవేంద్ర రెడ్డి, షేక్ రియాజుద్దీన్, జాన్ సదానందం, షబ్బీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలి



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ -- పి.జి.ఆర్.ఎస్) ద్వారా వచ్చిన ప్రతి అర్జీని నిర్దేశిత గడువులోపు నాణ్యతతో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ చిరంజీవి కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి వివిధ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు, వినతిపత్రాలను అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ మాట్లాడుతూ... ఫిర్యాదుల పరిష్కారంలో ఆలస్యం లేకుండా నిర్ణీత సమయంలోపు పరిష్కరించాలని సూచించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని, అర్జీలను ఆయా శాఖల అధికారులకు పంపించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)లో మొత్తం 353 దరఖాస్తులు రాగా, రెవెన్యూ క్లినిక్‌కు సంబంధించిన 215 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కొండయ్య, అధికారులు పాల్గొన్నారు.

మంగళవారం
13 - 01 - 2026
మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

## నష్టాల వృత్తిగా మారిన వ్యవసాయం

భారతదేశం వ్యవసాయ దేశమని గర్వంగా చెప్పుకుంటాం. రైతు దేశానికి అన్నం పెట్టే అన్నదాత అని వేదికలపై గొప్పగా మాట్లాడతాం. కానీ అదే రైతు పొలాల్లో నిలబడి తన పంటను చూస్తూ భవిష్యత్తు ఏమవుతుందోనని భయపడుతున్నాడు. వ్యవసాయం ఒకప్పుడు గౌరవప్రదమైన జీవనాధారం. ఇప్పుడు మాత్రం అనిశ్చితి, అప్పులు, నష్టాల వృత్తిగా మారిందనే అభిప్రాయం రైతుల నోటే కాదౌ సమాజమంతా ఒప్పుకుంటున్న నిజంగా మారుతోంది. ఈ పరిస్థితికి కారణం రైతు అలసత్వమా? లేక పాలన, విధానాలు, వ్యవస్థల వైఫల్యమా? అనే ప్రశ్నకు సమాధానం వెతకాల్సిన అవసరం ఉంది.

– ఖర్చుల పెరుగుదలౌ ఆదాయాల పతనం

వ్యవసాయం మొదలుపెట్టే ముందు నుంచే రైతు లెక్కలు వేసుకోవాల్సి వస్తోంది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, డీజిల్, కూలీల ఖర్చులు ఏటేటా పెరుగుతూనే ఉన్నాయి. ఒక ఎకరా సాగు చేయాలంటే పెట్టుబడి భారీగా అవసరం అవుతోంది. కానీ పంట పండిన తర్వాత వచ్చే ఆదాయం మాత్రం అదే స్థాయిలో నిలిచిపోతోంది. కొన్ని సందర్భాల్లో ఖర్చుల్ని కూడా తిరిగి పొందలేని పరిస్థితి నెలకొంటోంది. వర్షాలపై ఆధారపడే వ్యవసాయం ఇప్పుడు వాతావరణ మార్పుల దెబ్బకు మరింత అస్థిరంగా మారింది. అకాల వర్షాలు, కరవు, వరదలు రైతు కష్టాన్ని ఒక్కసారిగా నీళ్లలో కలిపేస్తున్నాయి.పంట దిగుబడి బాగున్నా ఆనందపడే పరిస్థితి రైతుకు లేదు. ఎందుకంటే దిగుబడి ఎక్కువైతే మార్కెట్లో ధర పడిపోతుంది. దిగుబడి తక్కువైతే పెట్టుబడి నష్టం. ఏ పరిస్థితిలోనూ రైతుకు భరోసా లేకుండా పోయింది. ఈ అసమతుల్యతే వ్యవసాయాన్ని నష్టాల వృత్తిగా మార్చే మొదటి అడుగు.

– మద్దతు ధరలు -- ప్రకటనలా? అమలులో శూన్యమా?

కనీస మద్దతు ధరలు రైతుకు రక్షణ కవచంగా ఉండాల్సింది. కానీ వాస్తవంలో అవి ప్రకటనలకే పరిమితం అవుతున్నాయనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. చాలా చోట్ల కొనుగోలు కేంద్రాలు లేవు. ఉన్న చోట్ల ఆలస్యం, నాణ్యత పేరుతో తిరస్కరణలు జరుగుతున్నాయి. దీంతో రైతు తప్పనిసరిగా మధ్యవర్తుల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. అక్కడే అసలు నష్టం మొదలవుతుంది.

రైతు పంటను తక్కువ ధరకు అమ్మితే, అదే పంట వినియోగదారుడికి చేరేసరికి ధరలు ఆకాశాన్ని అంటుతాయి. ఈ తేడా మొత్తం మధ్యలోని దళారుల జేబుల్లోకి వెళ్తోంది. మార్కెట్ వ్యవస్థ రైతుకు అనుకూలంగా లేకపోవడమే ఈ దుస్థితికి ప్రధాన కారణం. గిట్టుబాటు ధర లేకుండా వ్యవసాయం ఎలా లాభసాటిగా మారుతుంది అన్న ప్రశ్నకు ఇప్పటికీ స్పష్టమైన సమాధానం లేదు.

– అప్పుల ఉచ్చు -- రైతును మింగుతున్న వ్యవస్థ

వ్యవసాయం సాగు చేయాలంటే రుణాలు తప్పనిసరి అయ్యాయి. బ్యాంకుల నుంచి రుణాలు అందకపోతే రైతు ప్రైవేట్ అప్పులవారిని ఆశ్రయించాల్సి వస్తోంది. అక్కడ వడ్డీలు మరింత భారంగా మారుతున్నాయి. పంట నష్టపోతే రుణం తీర్చే మార్గం కనిపించదు. అప్పు మీద అప్పు పెరిగి రైతు పూర్తిగా అప్పుల ఉచ్చులో చిక్కుకుంటున్నాడు. రుణమాఫీ అనే మాట ఎన్నికల సమయంలో పెద్దగా వినిపిస్తుంది. కానీ అమలులో మాత్రం ఆలస్యం, పరిమితులు రైతును నిరాశకు గురిచేస్తున్నాయి. కొందరికి మాఫీ లభిస్తే, మరికొందరు పూర్తిగా బయటపడుతున్నారు. ఈ అసమానత రైతుల్లో అసంతృప్తిని పెంచుతోంది. అప్పుల భారం కేవలం ఆర్థిక సమస్య మాత్రమే కాదౌ మానసిక ఒత్తిడిని కూడా పెంచుతోంది. వ్యవసాయం నష్టాల వృత్తిగా మారిందన్న భావన ఇక్కడే బలపడుతోంది.

– పరిష్కారాల దారి -- వ్యవసాయానికి భవిష్యత్తు ఉందా?

వ్యవసాయాన్ని నష్టాల వృత్తిగా మార్చింది రైతు కాదౌ వ్యవస్థల వైఫల్యం. కాబట్టి పరిష్కారాలు కూడా సమగ్రంగా ఉండాలి. గిట్టుబాటు ధరలు కేవలం ప్రకటించడమే కాదు, వాస్తవంగా రైతు చేతికి అందేలా అమలు చేయాలి. కొనుగోలు కేంద్రాలు గ్రామ స్థాయికి చేరాలి. పంట బీమా సకాలంలో పరిహారం ఇచ్చేలా మారాలి.నిల్వ సదుపాయాలు, కోల్డ్ స్టోరేజీలు, మార్కెట్ లింకేజీలు రైతుకు అందుబాటులోకి వస్తే మధ్యవర్తులపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. చిన్న, సన్నకారు రైతులకు ఆధునిక సాంకేతికత, యంత్రాలు అందించాల్సిన అవసరం ఉంది. వ్యవసాయం లాభసాటిగా మారితేనే యువత మళ్లీ పొలాల వైపు చూస్తుంది. లేదంటే గ్రామాలు ఖాళీ అవుతాయౌ పట్టణాలు భారంగా మారతాయి. రైతు చేతిలో మట్టి మాత్రమే కాదౌ దేశ భవిష్యత్తు ఉంది. ఆ భవిష్యత్తును కాపాడుకోవాలంటే వ్యవసాయాన్ని నష్టాల వృత్తిగా కాకుండా గౌరవప్రదమైన జీవనాధారంగా మార్చాల్సిందే. ఇది పాలకుల బాధ్యత మాత్రమే కాదౌ సమాజమంతా తీసుకోవాల్సిన సమిష్టి బాధ్యత. లేకపోతే అన్నదాత అనే పదం కేవలం నినాదంగా మిగిలిపోయే ప్రమాదం తప్పదు.

# ఘనంగా స్వామి వివేకానంద జయంతి

మన గళం అవుకు : అవుకు పట్టణంలోని మదర్ మోడల్ హైస్కూల్ నందు కరస్పాండెంట్ ముచ్చల పూరి శ్రీనివాసల ఆధ్వర్యంలో సోమవారం స్వామి వివేకానంద 164 వ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ స్వామి వివేకానంద జనవరి 12.1863 న జన్మించాడు.1893 సంవత్సరంలో చికాగోలో జరిగిన మతం సమావేశంలో స్వామి వివేకానందకి కేవలం ఐదు నిమిషాళ్ళు మాత్రమే ఉపన్యాసం కొరకు కేటాయించడం జరిగింది. సిస్టర్స్ అండ్ బ్రదర్స్ ఆఫ్ అమెరికా అని మొదలుపెట్టగానే అందరూ ఆశ్చర్యపోయారు. ఉపన్యాసం కేవలం 5 నిమిషాలు కేటాయించిన ముగించేసరికి 45 నిమిషాలు వరకు కొనసాగించారు.తరువాత 15 నిమిషాలు అక్కడి ప్రజల చప్పట్లతో మారుమోగింది. హిందూ మతం యొక్క గొప్పతనాన్ని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన వ్యక్తి స్వామి వివేకానంద అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మల్లికా, ప్రధానోపాధ్యాయులు రాయసం మురళి మోహన్ , ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# పట్టణంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం





మన గళండోన్ పట్టణంలోని క్లబ్ హౌస్ ప్రాంగణంలో ఈరోజు సోమవారండోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి మరియు డోన్ మాజీ ఎమ్మెల్యే శ్రీమతి కోట్ల సుజాతమ్మ సహకారంతో,బసవతారక్ ఇండో--అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ మరియు రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ (స్క్రీనింగ్) శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమానికి డోన్ నియోజకవర్గ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తిస్తే పూర్తిగా నియంత్రించవచ్చని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ప్రజలు భయపడకుండా ముందుకు వచ్చి స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని, ఆరోగ్యమే మహాభాగ్యమని అన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో బసవతారక్ ఇండో--అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ తరహా కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# సంప్రదాయాలు పాటిద్దాం సమాజాన్ని రక్షిద్దాం

మన గళం బనగానపల్లె : నందివర్గం మరియు అవుకు పోలీస్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల ప్రజలు అందరూ సంక్రాంతి పండుగ సంతోషంగా జరుపుకోవాలని తెలియజేస్తూ

సంప్రదాయ క్రీడలు మాత్రమే ఆడాలని సూచించారు పేకాట జూదం కోడి పందెంలు గుండాట వంటి తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు అవుకు మండలం తో పాటు నందివర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు శివారు ప్రాంతాల్లో కోడి పందెంలు జూదాలు ఇతర చట్టవ్యతిరేక ఆటలు పూర్తిగా నిషేధం అన్నారు

ఎవరైనా కోడి పందెంలు ఆడినా ప్రోత్సహించినా నిర్వహించినా చర్యలు తప్పవన్నారు రెండు స్టేషన్ల పరిధిలో ఎక్కడైనా కోడిపందెంలు పేకాట జూదం గుండాట వంటి ఇతర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తుంటే మాకు గానీ స్థానిక పోలీసు సిబ్బందికి సమాచారం అందించాలని

సీ ఐ వీ మంజునాథ రెడ్డి తెలియజేశారు

సీ ఐ బనగానపల్లి రూరల్

మొబైల్ నంబర్ 9121101123

అవుకు ఎస్ ఐ 9121101125

నందివర్గం ఎస్ ఐ 9121101098

బనగానపల్లి రూరల్ సర్కిల్ ఆఫీస్

# సామాజిక బాధ్యతగా అభివృద్ధికి తోడ్పాటు అభినందనీయం

మనగళం, కలెక్టరేట్ : కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద అభివృద్ధికి తోడ్పాటు అందించడం అభినందనీయం అని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు. అర్సెలర్ మిట్టల్ గ్రీన్ ఎనర్జీ సంస్థ ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్--పీ4) కింద డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సెంటినరీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల, చిన్నటేకూరు,ఓర్వకల్లు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లకు రూ. 20 లక్షల చెక్కును సోమవారం కలెక్టరేట్ లో అర్సెలర్ మిట్టల్ గ్రీన్ ఎనర్జీ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్, ప్రాజెక్ట్ హెడ్ కోఆర్డినేటర్ శ్రీధర్ పరవాడ తదితరులు జిల్లా కలెక్టర్ కు అందచేశారు.ఈ సందర్భంగా కలెక్టర్... అర్సెలర్ మిట్టల్ గ్రీన్ ఎనర్జీ సంస్థ యాజమాన్యాన్ని అభినందించారు. పరిశ్రమలు, ఇతర కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యతగా తమ వంతు సహకారాన్ని అందించి జిల్లా అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి తోడ్పాటు అందించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్, ప్రాజెక్ట్ హెడ్ కోఆర్డినేటర్ శ్రీధర్ పరవాడ, సిపిఓ భారతి, సంస్థ ప్రతినిధులు లక్ష్మీకాంత్, కిరణ్ గుర్రం పాల్గొన్నారు.ం



# బిజెపియువ మోర్చా జిల్లా అధ్యక్షుడు కు ఘన స్వాగతం

మన గళండోన్ భారతీయ జనతా పార్టీ యువ మోర్చానంద్యాల జిల్లా అధ్యక్షుడు సిల్వరి వెంకటేష్ డోన్ పట్టణానికి వచ్చిన శుభసందర్భంగా బిజెపి నాయకులు ఘన స్వాగతం పలికారు.

.... ఈ కార్యక్రమంలో యువ నాయకుడు రాజపుత్ కమలేష్, హెచ్ కె నాయుడు, ముదిరాజు లక్ష్మీనారాయణ, ఆర్మీ రామయ్య, భాస్కర్ పాల్గొన్నారు. ... జిల్లా అధ్యక్షులకు శాలువా కప్పి భారత ప్రధాని నరేంద్ర మోడీ ఫోటో ఇవ్వడం జరిగినది.



# శ్రీ శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి హుండీ ఆదాయము





మనగళం శ్రీశైలం : ఈ రోజు ( 12.01.2026 ) జరిగిన హుండీల లెక్కింపు ద్వారా దేవస్థానానికి రూ. 3,72,50,251/- నగదు రాబడిగా లభించింది.

కాగా ఈ హుండీల రాబడిని భక్తులు గత 21 రోజులలో ( 22.12.2025 నుండి 11.01.2026 వరకు) సమర్పించడం జరిగింది.

అలాగే ఈ హుండీలో 158 గ్రాముల 200 మిల్లీగ్రాముల బంగారు, 11 కేజీల 460 గ్రాముల వెండి లభించాయి. అదేవిధంగా 1570 -- యుఎస్ఏ డాలర్లు, 180 -- యు.ఎ.ఇ దిర్హామ్స్, 1- కువైట్ దినార్, 5 - సౌదీరియాల్స్, 17 - సింగపూర్ డాలర్లు, 10 -- కెనడా డాలర్లు, 65 - ఇంగ్లాండు ఫౌండ్స్ , 11 - మలేషియా రింగిట్స్, 12510 - ఓమన్ బైసా, 50 - ఆస్ట్రేలియా డాలర్లు, 8 -- ఈరోస్, 5 -- ఐర్లాండ్, 1500 -- మయన్మార్, 10,000 - ఫ్రాన్స్ , 50 -- ఫిలిప్పీన్ , 2000 -- వియత్నామ్ మొదలైన విదేశీ కరెన్సీ కూడా ఈ హుండీల లెక్కింపులో లభించాయి.

పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాల నిఘాతో ఈ లెక్కింపును చేపట్టడం జరిగింది.

ఈ హుండీల లెక్కింపులో కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీ ఎ.వి. రమణ, శ్రీ చిట్టిబొట్ల భరద్వాజ శర్మ, డిప్యూటీ కార్యనిర్వహణాధికారిణి ఆర్.రమణమ్మ, పలు విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, సిబ్బంది, శివసేవకులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నప్రసాదవితరణ పథకానికి విరాళం



మనగళం శ్రీశైలం : శ్రీ ఆర్. గురవయ్య, మార్కాపురంవారు ఈ రోజు ( 12.01.2026) అన్నప్రసాదవితరణ పథకానికి విరాళం రూ. 1,00,116/-లను అందజేశారు. ఈ మొత్తాన్ని పర్యవేక్షకులు కె. అయ్యన్నకు అందజేయడం జరిగింది. దాతకు తగు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేయబడ్డాయి.

# రూపాయికే జొన్న రొట్టె, పప్పు

– ప్రారంభించిన ప్రముఖ వ్యాపారవేత్త సామాజిక కార్యకర్త గోళ్ళ రాజేష్



మనగళం, నంద్యాల : పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయం దగ్గర సంఘమిత్ర బాలుర గృహం ప్రక్కన సలీం నగర్ వెళ్ళే మార్గ మధ్యలో ఏర్పాటు చేసిన పేద ప్రజల కోసం పేదల పెద్దన్నలా గోళ్ల రాజేష్ ఒక రూపాయికే పుల్కాలు, కర్రీ తో పాటు ఒక్క రూపాయికే వెజిటేబుల్ పలావ్,కర్రి ప్రజలకు నిరంతరాయంగా అందించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం కేవలం ఒక్క రూపాయికే జొన్న రొట్టె,పప్పు పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని టేక్కే మున్సిపల్ హై స్కూల్ ఉపాధ్యాయులు బీ.సి.హుస్సేన్ సాహెబ్ ప్రజలకు రొట్టె పప్పు ను అందించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు బీ.సి. చిన్న హుస్సేన్ సాహెబ్ మాట్లాడుతూ గోళ్ళ రాజేష్ పేద ప్రజలందరికీ నిజంగానే పేదల పెద్దన్నగా ప్రజలందరికీ ఎన్నో రకాలుగా సహాయ సహకారాలు, ఆర్థిక సహకారాలు మరోవైపు కౌలు రైతులకు ఆర్థికంగా ఆదుకున్నారన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ప్రతినెల రూ. 2 వేలు ప్రకారం రెండు విడుతలు అందించడం చాలా గొప్ప కార్యక్రమం అన్నారు. గొళ్ళ రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాల నిర్వాహకులు ఏపిడబ్ల్యూజే నంద్యాల ఉపాధ్యక్షులు సీనియర్ రిపోర్టర్ నూర్ బాషా మాట్లాడుతూ నిజంగానే నంద్యాల ప్రజలకు గోళ్ళ రాజేష్ అన్న చేస్తున్నటువంటి సేవా కార్యక్రమాలు అద్భుతం అన్నారు.

# సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ప్రారంభం





మనగళం శ్రీశైలం : మకర సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకొని పంచాహ్నిక దీక్షతో నిర్వహించపబడే సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ఈ రోజు ( 12.01.2026) ప్రారంభమయ్యాయి. ఏడు రోజులపాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలు 18వ తేదీతో ముగియనున్నాయి. లోక కల్యాణం కోసం నిర్వహించబడుతున్న ఈ బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతిరోజూ జ్యోతిర్లింగస్వరూపుడైన శ్రీమల్లికార్జునస్వామివారికి విశేషార్చనలు, మహాశక్తిస్వరూపిణి అయిన శ్రీభ్రమరాంబాదేవిఅమ్మవారికి ప్రత్యేక పూజలు, ,నవగ్రహ మండపారాధనలు, కలశార్చనలు,జపాలు, పారాయణలు నిర్వహించబడుతున్నాయి. ఈ ఉదయం 9.15 గంటల నుంచి ఆలయప్రాంగణంలో ఉత్సవ ప్రారంభ కార్యక్రమాలు ఆగమ శాస్త్రానుసారం జరిపించబడ్డాయి.

యాగశాల ప్రవేశం : ఉత్సవ నిర్వహణలో భాగంగా ముందుగా కార్యనిర్వహణాధికారి, శ్రీ ఎం. శ్రీనివాసరావు దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీ ఎ.వి. రమణ, శ్రీ చిట్టిబొట్ల భరద్వాజ శర్మ ఉభయదేవాలయాల ప్రధానార్చకులు, స్థానాచార్యులు ( అధ్యాపక), అర్చకస్వాములు, వేదపండితులు, అధికారులు సంప్రదాయబద్ధంగా ఆలయప్రాంగణంలోని స్వామివార్ల యాగశాల ప్రవేశం చేశారు.

వేదస్వస్తి : యాగశాల ప్రవేశం చేసిన వెంటనే లోకక్షేమాన్నికాంక్షిస్తూ వేదపండితులు వేదపఠనతో వేదస్వస్తి నిర్వహించారు.

శివసంకల్పం : వేదస్వస్తి తరువాత దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించ కుండా సకాలంలో తగినంత వర్షాలు కురువాలని, దేశం పాడిపంటలతో తులతూగాలని, జనులందరికి ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు జరగకుండా ఉండాలనీ, దేశంలో అగ్ని ప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరు సుఖశాంతులతో ఉండాలంటూ ఆలయ అర్చకులు, వేదపండితులు లోక కల్యాణ సంకల్పాన్ని చెప్పారు.

గణపతిపూజ : సంకల్పపఠనం తరువాత ఉత్సవాలు నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజను చేయడం జరిగింది.

చండీశ్వరపూజ : గణపతిపూజ తరువాత శివ సంచార దేవతలలో ఒకరైన చండీశ్వరునికి విశేషపూజ జరిపించ బడింది. ఈ చండీశ్వరుడు స్వామివారి బ్రహ్మోత్సవ ఏర్పాటు చేస్తూ ఉత్సవాలను నిర్వహిస్తాడని చెప్పబడుతోంది.

కంకణపూజ -- కంకణ ధారణ : చండీశ్వర అర్చన తరువాత కంకణాలకు శాస్త్రోక్తంగా పూజాదికాలు నిర్వహించబడ్డాయి. అనంతరం అధికారులు, అర్చకస్వాములు, స్థానాచార్యులు కంకణాలను ధరించారు.

ఋత్విగ్వరణం : కంకణధారణ తరువాత ఋత్విగ్వరణం నిర్వహించబడింది. బ్రహ్మోత్సవాలలో ఆయా వైదిక కార్యాలను నిర్వహించమని ఋత్వికులను ఆహ్వానిస్తూ వారికి దీక్షావస్త్రాలను అందజేసే కార్యక్రమానికే ఋత్విగ్వరణం అని పేరు.

అఖండదీప స్థాపన : తరువాత అఖండ దీపస్థాపన, వాస్తుపూజ, వాస్తు హోమం జరిపించబడ్డాయి. వాస్తు హోమం తరువాత మండపారాధన, పంచావరణార్చన, ప్రధాన కలశస్థాపన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.

సాయంకాలం కార్యక్రమాలు

అంకురార్పణ : ఈ రోజు సాయంకాలం అంకురార్పణ జరిపించబడుతుంది. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రాంగణంలోని నిర్ణీత ప్రదేశంలోని మట్టిని సేకరించి సంప్రదాయబద్ధంగా యాగశాలకు తీసుకువస్తారు. తరువాత ఈ మట్టిని 9 పాలికలలో ( మూకుళ్లలో) నింపి దాంట్లో నవధ్యానాలు పోసి ఆ మట్టిని మొలకెత్తించేపనిని ప్రారంభిస్తారు. ఈ పాలికలలో రోజు నీరు పోసి నవధ్యానాలు పచ్చగా మొలకెత్తేలా చేస్తారు. ఈ విధంగా అంకురాలను ఆరోరింపజేసే కార్యక్రమం కాబట్టే దీనికి అంకురార్పణ అని పేరు.

ధ్వజారోహణ :అంకురార్పణ తరువాత జరిగే ధ్వజారోహణకు ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఆలయప్రాంగణంలోని ప్రధాన ధ్వజస్తంభం మీద పతావిష్కరణ చేయడమే "ధ్వజారోహణ". ఈ కార్యక్రమములో ఒక కొత్తవస్త్రం మీద పరమశివుని వాహనమైన నందీశ్వరుని, అష్టమంగళ చిత్రాలను చిత్రీకరిస్తారు. దీన్నే 'నందిధ్వజపటం' అంటారు. దీన్ని ధ్వజస్తంభం మీద కట్టేందుకు నూలుతో చేసిన తాడును సిద్ధం చేస్తారు. ఈ నంది ధ్వజపటాన్ని ఊరేగింపుగా, ధ్వజస్తంభం వద్దకు తెచ్చి, చండీశ్వరస్వామి సమక్షములో పూజాదికాలను నిర్వహిస్తారు.

ధ్వజారోహణలో భాగంగానే భేరీపూజ, కూడా నిర్వహించబడుతుంది. ఈ భేరీపూజలో డోలు వాద్యానికి పూజాదికాలు జరుగుతాయి. తరువాత నాదస్వరంపై ఆయా రాగాల ఆలాపనతో దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తారు. చివరగా ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపై ఎగురవేస్తారు. ధ్వజస్తంభం మీద ఎగిరే ఈ నంది పతాకమే సకల దేవతలకు, యక్ష, గంధర్వ గణాలకు ఆహ్వానం అన్నమాట. ఈ ఆహ్వానంతో విచ్చేసిన దేవతలకు నిర్ణీత స్థలాలు కేటాయించి రోజూ విధివిధానంగా వారికి నివేదన సమర్పిస్తారు. ఈ బ్రహ్మోత్సవాలలో సకల దేవతలు క్షేత్రములోనే ఉంటూ ఉత్సవాలను తిలకిస్తారని ఆగమశాస్త్రాలు పేర్కొంటున్నాయి.

రేపటి కార్యక్రమాలు : ఈ బ్రహ్మోత్సవాలలో భాగంగా రేపు (13.01.2026) శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు, చండీశ్వరపూజ, మండపారాధనలు, పంచావరణార్చనలు, జపానుష్ఠానాలు, రుద్రహోమం, సాయంకాల నిత్యహవనాలు జపాలు, పారాయణలు మొదలైన కార్యక్రమాలు నిర్వహించబడుతాయి. ఈ ఉత్సవాలలో భాగంగా రేపు సాయంకాలం శ్రీస్వామిఅమ్మవార్లకు భృంగివాహనసేవ ఊరేగింపు జరిపించబడుతుంది.



# బంగారం వెండి ధరల్లో మళ్లీ పెరుగుదల..!

హైదరాబాద్ , మనగళం : అంతర్జాతీయంగా నెలకొన్న తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో బంగారం, వెండి ధరలు మరోసారి భారీగా పెరిగాయి. అమెరికా కేంద్ర బ్యాంకుపై ఆ దేశ న్యాయ శాఖ ఒత్తిడి పెరుగుతుండటం, ఇరాన్‌లో నిరసనలు హింసాత్మకంగా మారడం వల్ల ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితి వాతావరణం నెలకొంది. ఈ పరిస్థితుల్లో ఇన్వెస్టర్లు సురక్షిత పెట్టుబడులుగా భావించే పసిడి, వెండి వైపు మొగ్గుచూపుతున్నారు. సోమవారం దేశీయ కమోడిటీ మార్కెట్లో ఫిబ్రవరి డెలివరీ బంగారం ధర 1.46 శాతం పెరిగి 10 గ్రాములకు 140838కు చేరింది. అలాగే మార్చి డెలివరీ వెండి ధర ఏకంగా 3.66 శాతం ఎగబాకి కిలోకు 261977గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధర ఔన్సుకు 4601 గరిష్ఠ స్థాయిని తాకడం గమనార్హం.అమెరికా కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయ పునరుద్ధరణ వ్యయాలపై ఇచ్చిన వాంగ్మూలానికి సంబంధించి బ్యాంకు చైర్మన్‌కు న్యాయ శాఖ నుంచి సమన్లు అందడం మార్కెట్లలో ఆందోళనను పెంచింది. దీని వల్ల ఆ దేశ ప్రభుత్వ జోక్యం పెరుగుతోందన్న భయాలు ఇన్వెస్టర్లను వెంటాడుతున్నాయి. మరోవైపు ఇరాన్‌లో కొనసాగుతున్న తీవ్ర నిరసనలు మధ్యప్రాచ్య రాజకీయ పరిస్థితులను మరింత అస్థిరంగా మార్చాయి. ఈ పరిణామాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా యుద్ధ వాతావరణం, రాజకీయ ఉద్రిక్తతలు, ఉద్యోగ గణాంకాలపై నెలకొన్న అనిశ్చితి కలిసి బంగారం, వెండికి డిమాండ్‌ను పెంచుతున్నాయి. మార్కెట్ నిపుణుల అంచనాల ప్రకారం సమీప కాలంలో బంగారం ధర 141350 స్థాయిని, వెండి ధర 255810 స్థాయిని పరీక్షించే అవకాశాలు కనిపిస్తున్నాయి. పరిస్థితులు మారకపోతే సురక్షిత పెట్టుబడుల వైపు పెట్టుబడిదారుల పరుగులు మరింత వేగం పెంచే సూచనలు కనిపిస్తున్నాయి.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# తూర్పుగోదావరి వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన ఏర్పాటు

మనగళం శ్రీశైలం : దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈ రోజు (11.01.2026) శ్రీ వైష్ణవి నాట్యాలయం, తూర్పుగోదావరి వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించబడుతున్నది. ఈ కార్యక్రమములో వినాయకకౌత్వం, శివపంచాక్షరి, శివ శంకరం, నటరాజస్తోత్రం తదితర గీతాలకు లక్ష్మి భవ్యశ్రీ, ప్రవల్లి, కంచెలలిత, సి.ఎస్. మోక్ష తదితర గీతాలకు ప్రియాంక, రామతులసి, అర్చన, ధనుశ్రీ, అంబిక తదితరులు నృత్యప్రదర్శన చేయనున్నారు. రెండవ కార్యక్రమములో భాగంగా జీవన వాహిని చారిట్రబుల్ ట్రస్ట్, హైదరాబాద్ వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమములో గణపతి కౌత్వం, గణనాయక, శివపంచాక్షరి, శివశంభో, జతిస్వరం, నటరాజకౌత్వం తదితర గీతాలకు జయంత్‌కుమార్, మహిమ, కార్తిక్, భాగ్యవత్, శరణ్య తదితరులు నృత్య ప్రదర్శన చేయనున్నారు. కాగా ఈ నిత్య కళారాధనలో ఆయా రోజులలో హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని



లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామి అమ్మ వార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

# డ్రగ్స్ రహిత భారతదేశంపై వర్క్ షాప్




మనగళం, కర్నూలు సిటీ : జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి సోమవారం కర్నూలు జిల్లా కోర్టు నందు గల న్యాయ సేవ సదన్ నందు డ్రగ్స్ రహిత భారతదేశంపై వర్క్ షాప్ నిర్వహించారు. పుల్లయ్య కాలేజీ విద్యార్థులకు,ప్యారా లీగల్ వాలంటీర్లకు, ప్యానల్ న్యాయవాదులకు మాదకద్రవ్యాల వినియోగం వలన యువతకు జరిగే దుష్ప్రభావాలపై ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్ షాప్ నందు జడ్జి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వలన యువతకు కలిగే ఆరోగ్య సమస్యలు, ప్రమాదాలు,సామాజిక దుష్ప్రభావాల గురించి అవగాహన కల్పించారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల మేరకు జాతీయ యువ వారోత్సవాల్లో భాగంగా ఈనెల 5వ తారీఖు నుండి 12వ తేదీ వరకు స్కూల్స్, హాస్టల్స్ మరియు కాలేజీల నందు అనేక న్యాయ విజ్ఞాన సదస్సులు చేసి యువతకు మాదకద్రవ్యాల వినియోగం వలన జరిగే అనార్థాలను గురించి వివరించా మని తెలిపారు. జనవరి 12వ తేదీ వివేకానందుని జన్మదినం సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేశారు. వివేకానంద స్ఫూర్తిగా తీసుకొని యువత జీవితంలో అభివృద్ధి పథంలో నడవాలని సూచించారు. న్యాయవాది గీతామాధురి నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో టోల్ ఫ్రీ నెంబర్. 1933 మరియు లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 ల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. "డ్రగ్స్ వద్దు –జీవితమే ముద్దు"అనే ప్రతిజ్ఞను విద్యార్థులు చేత చేపించారు.అనంతరం పుల్లయ్య విద్యాసంస్థల అధినేత పుల్లయ్య మాట్లాడుతూ నేటి యువతే దేశానికి పట్టుకొమ్మలని యువత చెడు వ్యసనాలకు లోను కాకుండా సమాజం కోసం పాటుపడాలని కోరారు. యువత వివేకానందుని స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ సదస్సులో పుల్లయ్య కాలేజీ విద్యార్థులు, ప్యారా లీగల్ వాలంటీర్స్,ప్యానెల్ లాయర్స్ పాల్గొన్నారు.

# వైసిపి హయాంలో ఎత్తిపోతలలో దొంగలు పడ్డారు..

- సాగు,తాగునీరు అందించిన ఘనత కూటమిదే – నియోజకవర్గ ద్రోహి జగన్మోహన్ రెడ్డి
- గడ్డం నారాయణరెడ్డి వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి..
- టిడిపి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు,మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మాధవరావు దేశాయ్

నందవరం జనవరి 12 మనగళం న్యూస్. : వైసీపీ ప్రభుత్వం హాయంలో ఎత్తిపోతలలో దొంగలు పడ్డారని నందవరం మండలం టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు,మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మాధవరావుదేశాయ్ తెలిపారు.సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు.కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకులు గడ్డం నారాయణరెడ్డి అవగాహన లేకుండా మాట్లాడడం పద్ధతి కాదన్నారు.గ్రామాలకు న్యాయం చేయలేని నాయకులు కూడా రాష్ట్ర ముఖ్యమంత్రిని నిందిస్తూ మాట్లాడడం సరికాదన్నారు.సాగు,త్రాగునీరు అందించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందని వారు కొనియాడారు.కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉన్నారన్నారు.రైతులకు నమ్మకద్రోహి చంద్రబాబు కాదు,జగన్మోహన్ రెడ్డి అని తెలిపారు.ఆర్డీఎస్ నిర్మాణానికి 2017 సంవత్సరంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి 2వేల కోట్ల రూపాయలను అనుమతి తీసుకువస్తే, వైసీపీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆ నిధులు రాకుండా అడ్డుకొని రాయలసీమకు ద్రోహం చేశారన్నారు.మాజీ మంత్రి బివి మోహన్ రెడ్డి మంత్రాలయం నుండి కర్నూలుకు రైల్వే లైను నిర్మాణాలు చేపడితే వైసీపీ ప్రభుత్వం దాని నాశనం చేసిందన్నారు.రాష్ట్రానికి,నియోజకవర్గానికి నిజమైన ద్రోహి జగన్ అని తెలిపారు.వారి హయాంలో పత్తి పంటకు గిట్టుబాటుకు ధర రాక రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు.7వేల రూపాయల ధర తగ్గకుండా పత్తి కూటమి ప్రభుత్వం కొందన్నారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో మండలంలో ఎత్తిపోతల పథకం నిర్వీయమైందన్నారు.ఎత్తు పోతల పథకాల దగ్గర మోటర్లు,వైర్లను దొంగలు విచ్చలవిడిగా ఎత్తికెళ్ళి రైతులకు నీరు అందించడంలో విఫలమయ్యారని గుర్తు చేశారు.కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వాటి మరమ్మతలను చేపట్టి రైతులకు నీరు అందించిన సంగతి గడ్డం నారాయణరెడ్డికి కనిపించదని విమర్శించారు.గ్రామాలలో త్రాగునీరు లేక ప్రజలు అవస్థలు పడ్డారు,చాలా గ్రామాలలో పైప్లైన్ నిర్మించి త్రాగునీరు అందించామని తెలిపారు. మండలం,నియోజకవర్గ అభివృద్ధి ఆయనకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.కేసులకు భయపడి రేవంత్ రెడ్డికి చంద్రబాబు నాయుడు మద్దతుగా



ఉన్నారని నారాయణరెడ్డి అనడం విడ్డూరంగా ఉందన్నారు.అక్రమ సంపాదన కేసులో జైలు జీవితాన్ని గడిపి ఆ కేసుల నుండి బయట పడాలని మీ నాయకుడు రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేసారని గుర్తు చేశారు.వైసీపీ బూటకపు మాటలను నమ్మే స్థితిలో ప్రజలు లేరని ఆయన తెలిపారు.

# ఎస్‌బీఐ ఖాతాదారులకు అలర్ట్..

హైదరాబాద్ ,మనగళం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారులకు కీలక సమాచారం. బ్యాంకు ఇటీవల ఏటీఎం లావాదేవీలపై వసూలు చేసే ఛార్జీలను పెంచింది. ఇంటర్‌ఛేంజ్ ఫీజు పెరగడంతో ఈ మార్పు అనివార్యమైందని ఎస్‌బీఐ తెలిపింది. కొత్త ఛార్జీలు 01-12-2025 నుంచి అమల్లోకి వచ్చాయి. గతంలో కూడా ఫిబ్రవరి నెలలో ఇదే తరహా పెంపు జరిగిన విషయం తెలిసిందే.

సేవింగ్స్ ఖాతాదారులు ఇతర బ్యాంకుల ఏటీఎంలలో నెలకు 5 ఉచిత లావాదేవీలు చేసుకోవచ్చు. ఈ పరిమితి దాటిన తర్వాత నగదు ఉపసంహరణకు ఒక్కో లావాదేవీపై 23 జీఎస్టీ అదనంగా వసూలు చేస్తారు. బ్యాలెన్స్ చెక్, మినీ స్టేట్‌మెంట్ వంటి నాన్ ఫైనాన్షియల్ లావాదేవీలకు 11 జీఎస్టీ అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

శాలరీ ఖాతాదారులకు గతంలో ఇతర బ్యాంకుల ఏటీఎంలలో పరిమితి లేకుండా ఉచిత లావాదేవీలు ఉండేవి. తాజా మార్పులతో ఇప్పుడు నెలకు 10 ఉచిత లావాదేవీలకే అవకాశం ఉంటుంది. ఆ తర్వాత సేవింగ్స్ ఖాతాదారుల మాదిరిగానే నగదు ఉపసంహరణకు 23 జీఎస్టీ, నాన్ ఫైనాన్షియల్ లావాదేవీలకు 11 జీఎస్టీ చెల్లించాలి. అయితే ఎస్‌బీఐ సొంత ఏటీఎంలలో మాత్రం ఛార్జీల్లో ఎలాంటి మార్పులు లేవు.

# విశాఖపట్నం వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన ఏర్పాటు చేయబడింది

మనగళం శ్రీశైలం : దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈ రోజు (12.01.2026) కళారాధన మ్యూజిక్ అండ్ డాన్సు అకాడమీ, విశాఖపట్నం వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన ఏర్పాటు చేయబడింది.

ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించబడుతున్నది.

ఈ కార్యక్రమములో వినాయకకౌత్వం, శివతాండవం, శివపంచాక్షరి, శివ శంకరం, నటరాజస్తోత్రం తదితర గీతాలకు సందీప్, మణి, అక్షయ్య, నిత్యఅన్నపూర్ణశ్రీ, కావ్యశ్రీ, త్రివేణి తదితరులు నృత్యప్రదర్శన చేయనున్నారు.

రెండవ కార్యక్రమములో భాగంగా శ్రీ సి.హెచ్. నాగబాబు భాగవతార్, కోనసీమ వారిచే 'శివలీలలు' పై హరికథగానం కార్యక్రమం ఏర్పాటు చేయబడింది.

ఈ కార్యక్రమానికి మృదంగ సహకారాన్ని శ్రీ చైత్యన్యకృష్ణ హార్మోనియం సహకారాన్ని శ్రీ వెంకటేశ్వరబ్రహ్మం అందిస్తున్నారు.

కాగా ఈ నిత్య కళారాధనలో ఆయా రోజులలో హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా



జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

# నేడు టిడ్కో లబ్దిదారులకు గృహాల అప్పగింత

**– నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ – 239, 240, 241 బ్లాకుల్లో 144 గృహాలు సిద్ధం**

మనగళం, కర్నూలు కార్పొరేషన్ : జగన్నాథగట్టుపై ఉన్న ఎన్టీఆర్ కాలనీలో నిర్మాణాలు పూర్తైన టిడ్కో గృహాలను లబ్దిదారులకు మంగళవారం అప్పగించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. సోమవారం ఆయన టిడ్కో గృహాల్లో పూర్తైన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అర్హులైన పేద కుటుంబాలకు పక్కా గృహాలు అందించే దిశగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఎన్టీఆర్ కాలనీలో 976 టిడ్కో గృహాలు అప్పగించాల్సి ఉండగా, వాటిలో తొలి దశలో ఇప్పటికే 187 గృహాలు లబ్దిదారులకు అందించామని, ప్రస్తుతం 239, 240, 241 బ్లాకుల్లో 144 గృహాలను అప్పగించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని వివరించారు. మంగళవారం రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్, ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు గౌరు చరితరెడ్డి, బొగ్గుల దస్తగిరి చేతుల మీదుగా గృహాల అప్పగింత జరగనున్నట్లు తెలిపారు. టిడ్కో గృహాల నిర్మాణాలు అత్యుత్తమ నాణ్యతతో, కొత్త సాంకేతికతతో చేపట్టినట్లు తెలిపారు. రవాణా సౌకర్యం, తాగునీటి సరఫరా, విద్యుత్, రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతులు ఇప్పటికే కల్పించామని చెప్పారు. లబ్దిదారులు వెంటనే ఇళ్లలో నివాసం ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. మిగిలిన గృహాలను కూడా పనులు పూర్తయ్యే క్రమంలో దశలవారీగా అప్పగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రజారోగ్య



అధికారి డాక్టర్ నాగ ప్రసాద్, టిడ్కో అధికారులు పెంచలయ్య, మధు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ హుస్సేన్, ఎలక్ట్రికల్ సూపర్వైజర్ జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

# రహదారి భద్రత మహోత్సవాలు నిర్వహించిన ఆర్టీవో క్రాంతి కుమార్







మన గళండోన్ పట్టణంలోనిజాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు-- 2026 కార్యక్రమంలో భాగంగా డోన్ పరిధిలోని జాతీయ రహదారిపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అల్ ఇండియా స్లీపర్ బస్ ద్వారా ప్రయాణిస్తున్న ప్రయాణికులకు, రోడ్ ప్రమాదాలు సంభవించినప్పుడు మరియు అగ్ని ప్రమాదాలు జరిగిన సందర్భాలలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, అత్యవసర పరిస్థితుల్లో బస్ నుండి సురక్షితంగా ఎలా బయటపడాలి అనే అంశాలపై వివరంగా అవగాహన కల్పించబడింది.

అదేవిధంగా, ప్రయాణ సమయంలో సీటు బెల్ట్ వినియోగం, అత్యవసర ద్వారాల వినియోగ విధానం, అగ్నిమాపక పరికరాల ఉపయోగం, డ్రైవర్ మరియు సిబ్బంది సూచనలను పాటించాల్సిన అవసరం, అలాగే ప్రయాణికులు తీసుకోవలసిన సాధారణ భద్రతా చర్యల గురించి స్పష్టంగా వివరించబడింది. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారి తీస్తుందని ఈ సందర్భంగా ప్రయాణికులకు తెలియజేయడం జరిగింది. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా ప్రయాణికులలో రోడ్డు భద్రతపై చైతన్యం పెంపొందించడంతో పాటు, ప్రమాదాల సమయంలో ప్రాణ నష్టం తగ్గించడమే ప్రధాన లక్ష్యం అని ఆర్టీవో క్రాంతి కుమార్ తెలిపారు.

# గ్రామ కమిటీల పాత్రే పార్టీ బలోపేతానికి కీలకం


– కోడుమూరు నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ ఆదిమూలపు సతీష్





మన గళం కోడుమూరు ;వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంలో ప్రతి కార్యకర్త కీలక పాత్ర పోషించాల్సిందేనని, గ్రామ స్థాయి కమిటీలే పార్టీకి పునాదులని కోడుమూరు నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ ఆదిమూలపు సతీష్ అన్నారు. పార్టీకి నిబద్ధతగా, నిరంతరం పనిచేసే కార్యకర్తలనే గ్రామ కమిటీల్లో నియమించాలని ఆయన సూచించారు. సోమవారం కర్నూలు నగరంలో లక్ష్మి కళ్యాణమండపంలో కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పార్టీ సంస్థాగత నిర్మాణ సమావేశంలో నంద్యాల జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కర్నూల్ పార్లమెంట్ అబ్జర్వర్ గంగుల ప్రభాకర్ రెడ్డి, పార్లమెంట్ ఇన్చార్జి, మాజీ ఎంపీ బుట్టా రేణుక, పత్తికొండ మాజీ ఎమ్మెల్యే ఇంచార్జ్ శ్రీదేవి, ఎమ్మిగనూరు ఇంచార్జ్ రాజీవ్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, మేయర్ బివై రామయ్య, సెంట్రల్ పార్టీ ఆఫీసు నుంచి మధుసూదన్ రెడ్డి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్ మాట్లాడుతూ కోడుమూరు నియోజవర్గంలో కుడా మాజీ చైర్మన్ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు కోట్ల హర్షవర్ధన్ రెడ్డి నాయకత్వంలో, “పార్టీ వృద్ధి కోసం అహర్నిశలు పనిచేస్తున్న కార్యకర్తల ఆలోచనలే పార్టీ భవిష్యత్ కార్యక్రమాలకు దిశానిర్దేశం చేస్తాయి. పార్టీ భవిష్యత్ పూర్తిగా కార్యకర్తల చేతుల్లోనే ఉంది. మీరే పార్టీ దిశా నిర్దేశకులుగా నిలిచి, ఇప్పటి నుంచే ప్రణాళికబద్ధంగా పనిచేసి రానున్న ఎన్నికల్లో పార్టీని విజయతీరాలకు చేర్చాలి” అని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం నుంచి పార్టీకి విశ్వాసంతో పనిచేసే కార్యకర్తలను ఎంపిక చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. వచ్చే ఫిబ్రవరి నెలలోపు కమిటీల నిర్మాణం పూర్తిచేయాలి” అని ఆయన సూచించారు. భవిష్యత్తులో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చినప్పుడు కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, గౌరవం తప్పకుండా లభిస్తుందని భరోసా ఇచ్చారు.

# రేషన్ డీలర్ మార్చాలంటూ ఎమ్మార్వో కి కురుకుంద ప్రజలు వినతి





( ఆలూరు మనగళం): ఆలూరు మండలం, కురుకుంద గ్రామంలో గ్రామస్తులు అంత కలిసి రేషన్ డీలర్ సత్యనారాయణ రెడ్డి పై ఎమ్మార్వో శోభ సువర్ణమ్మ కు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఉన్న రేషన్ డీలర్ సత్యనారాయణరెడ్డి వినియోగదరులకు సక్రమంగా బియ్యం వేయడం లేదు. రేషన్ డీలర్ సత్యనారాయణ రెడ్డి కురుకుంద గ్రామంలో ఉండడం లేదు, ఆయన ఆదోనిలో నివాసం ఉంటున్నాడు. కూటమి ప్రభుత్వం నిర్ణయించిన సమయంలో రేషన్ దుకాణం తెరవడం లేదు. ఒక్కొక్క రేషన్ కార్డుకు కేజీ నుండి కేజిన్నర వరకు బియ్యం తగ్గించి వేస్తున్నాడు. బియ్యం తగ్గించి వేస్తున్నారని ప్రశ్నిస్తే ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ దురుసుగా ప్రవర్తిస్తున్నాడు. తూకం కూడా కనిపించకుండా డబ్బాతో కొలతలు పెట్టి వేస్తున్నాడు. 60 సంవత్సరాలు పైబడిన వారికి ఇంటిదగ్గర బియ్యం వేయాలి అనే నిబంధనను తుంగలో తొక్కుతూ బియ్యం వేయకుండా నిర్లక్ష్యం వేయిస్తున్నాడు. వృద్ధులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. బియ్యం వేసుకోవడానికి వెళ్లిన సమయంలో డీలర్ సత్యనారాయణ రెడ్డి ఉండడం లేదు, ఈ చతంగం దాదాపు 10 నెలల నుంచి కొనసాగుతూనే ఉంది. ప్రజలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డీలర్ సత్యనారాయణ రెడ్డి పై తగు చర్యలు తీసుకోని, వెంటనే డీలర్ ను తొలగించాలని కురుకుంద గ్రామ ప్రజలంతా కలిసి ఎమ్మార్వో శోభ సువర్ణమ్మ కు ఫిర్యాదు చేశారు. ఎమ్మార్వో శోభ సువర్ణమ్మ సానుకూలంగా స్పందించి వెంటనే విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీరాములు, పులిరెడ్డి, గోవర్ధన్, శీన, మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సంక్రాంతి పండుగ సందర్భంగా ధర్మవరం సుబ్బారెడ్డి యువసేన ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు








మన గళండోన్ పట్టణంలోని “సంక్రాంతి పండుగ” సందర్భంగా ఈ రోజు సోమవారం ధర్మవరం సుబ్బారెడ్డి యువసేన ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు డోన్ పట్టణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి కార్యాలయం నందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డిలి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలు అబశ్రీశ్రీ లిమన్నె మల్లీశ్వరమ్మ , చాటకొండ సునిత , మన్నె భారతి , తనుజా , శాలిని ప్రకాష్ గారు, మన్నె సాత్వీక ,మన్నె కావ్య లి హాజరయ్యారు.

ముగ్గులపోటిలో గెలుపొందిన వారు:

1??.వెుంద టి బవాు మ తి:ఫ్రీ డ్జ్, ౌఱఅఅవతీ: రమణమ్మ(సీసంగుంతల, డోన్),

2??.రెండవ బహుమతి: వాషింగ్ మిషన్, ౌఱఅఅవతీ:పి.రామేశ్వరమ్మ(బేతంచేర్ల)

3??.మూడవ బహుమతి: టి.వి, ౌఱఅఅవతీ: అర్చన(కొత్తపేట, డోన్)

4??.నాలుగవ బహుమతి:మిక్సర్ గ్రైండర్, ౌఱఅఅవతీ: పావని (గోసానిపల్లె)

5 . ఐ ద ో వ బహుమతి:గ్యాస్ స్టవ్, ౌఱఅఅవతీ: 1.కవిత(ప్యాపిలి), 2.విజయ లలితా (టి.ఆర్.నగర్,డోన్)

ఈ కార్యక్రమంలో లిసీనియర్ టిడిపి నాయకులు చాటకొండ శ్రీనివాసులు , అడ్వకేట్ ఆలా మల్లిఖార్జున రెడ్డి ,తెలుగుదేశం యువ నాయకులు ధర్మవరం మన్నె గౌతమ్ కుమార్ రెడ్డి , యువ నాయకులు ధర్మవరం మన్నె భరత్ కుమార్ రెడ్డి , సిటి కేబుల్ కిరణ్ ,హనుమంత రెడ్డి , చనుగొండ్ల కాశీ విశ్వనాథ్ లి మరియు ధర్మవరం సుబ్బారెడ్డి యువసేన పాల్గొన్నారు.




Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP.
Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.